

4లో..

ప్రజలు సుఖశాంతులతో ఉండాలని..

» ఆలయాల్లో మంత్రి రవీంద్ర అర్చనలు » నేడు బాధ్యతల స్వీకరణ



అమరావతి రాజధాని రైతులు ఆదివారం కనకదుర్గమ్మకు మొక్కులు తీర్చుకున్నారు. రాజధాని రైతులు, మహిళలు పెద్ద సంఖ్యలో కాలినడకన ఇంద్రకీలాద్రికి చేరుకున్నారు. తుళ్లూరు నుంచి మహిళలు పొంగళ్లను నెత్తిన పెట్టుకుని వచ్చారు. అమరావతి ఏకైక రాజధానిగా ఉండాలన్న తమ కోరికను కనకదుర్గమ్మ నెర వేర్చిందని, అందుకే మొక్కులు చెల్లించుకున్నామన్నారు.

మొక్కు తీరింది..



దుర్గమ్మకు మొక్కు తీర్చుకునేందుకు కాలినడకన వెళుతున్న అమరావతి రైతులు

ఘన కార్యాలయాలు

సామాన్యుడు వంద గజాల్లో చిన్న ఇల్లు నిర్మించుకోవాలంటే బిల్డింగ్ ప్లాన్ అనుమతి కోసం నిర్ణీత రుసుం చెల్లించి దరఖాస్తు చేసుకోవాలి. అనుమతి వచ్చిన తర్వాతే భవన నిర్మాణం చేపట్టాలి. ఇదీ నిబంధన. కానీ, ఐదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన వైసీపీ పెత్తందారులకు ఈ నిబంధనలేవీ వర్తించవు. అసలు తామేంటీ.. భవన నిర్మాణాలకు అనుమతి తీసుకోవడమేంటీ.. అనే రీతిలో వైసీపీ పెత్తందారులు వ్యవహరిస్తుంటారు. వైసీపీ కృష్ణాజిల్లా అధ్యక్షుడిగా ఉన్న పేర్ని నాని కానీ, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడిగా ఉన్న వెలంపల్లి శ్రీనివాసరావు కానీ ఈ పెత్తందారీ పోకడలతోనే వ్యవహరిస్తారు. వీరి ప్రవర్తనతో ఇప్పుడు విజయవాడ, మచిలీపట్నంలో నిర్మించిన వైసీపీ కార్యాలయాలు అనధికార కట్టడాలుగా మిగిలిపోనున్నాయి. - (విజయవాడ-ఆంధ్రజ్యోతి)

అనుమతుల్లేకుండా వైసీపీ కృష్ణా, ఎన్టీఆర్ జిల్లా కార్యాలయ నిర్మాణాలు

- విజయవాడలో 1850 గజాలు కేటాయింపు
- రూ.20 కోట్ల విలువైన స్థలం సమర్పయామి
- ఏడాదికి రూ.400 చెల్లించేలా 33 ఏళ్లకు లీజు
- మచిలీపట్నం నడిబొడ్డున రెండెకరాలు కేటాయింపు
- ఏడాదికి రూ.12 వేల చొప్పున 33 ఏళ్లకు లీజు
- అనుమతుల్లేకుండానే నిర్మాణ పనులు



బందరులోని వైసీపీ కార్యాలయం

తాడేపల్లి ప్యాలెస్‌ను పోలి వైసీపీ కార్యాలయం నిర్మాణం

కృష్ణాజిల్లా వైసీపీ కార్యాలయం కోసం మచిలీపట్నం నడిబొడ్డున గజం రూ.40 వేలు పలికే ప్రాంతంలో సుమారు రెండు ఎకరాల స్థలాన్ని కేటాయించారు. ఈడేపల్లిలో జిల్లా జడ్జి బంగ్లా ఎదురుగా ఉన్న ఈ ఖరీదైన స్థలం లీజు ఎంతో తెలుసా? రెండు ఎకరాలకు నెలకు రూ.1,000. అంటే ఏడాదికి రూ.12 వేలు లీజు చెల్లిస్తారన్నమాట. ఇలా 33 ఏళ్లకు లీజుకు తీసుకున్నారు. పోనీ ఇంత తక్కువకు లీజుకు తీసుకున్న పెద్దమనుషులు ఆ స్థలంలో కట్టే భవనానికైనా నిర్ణీత రుసుం చెల్లించారా అంటే అదీ లేదు. ఐదేళ్లుగా అసలు మమ్మల్ని అడిగేదెవరూ అనే రీతిలో వ్యవహరించిన వైసీపీ నాయకులు ఎలాంటి భవన నిర్మాణ అనుమతులు లేకుండానే ఆ స్థలంలో ఆగమేఘాలపై ఇంద్రభవనం లాంటి వైసీపీ కార్యాలయాన్ని నిర్మించేశారు. ఈ భవనం తాడేపల్లిలోని జగన్ ప్యాలెస్‌ను పోలి ఉండటం గమనార్హం. రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన వైసీపీ జిల్లా కార్యాలయాలన్నీ దాదాపు ఇలానే ఉండటం గమనార్హం. వాస్తవానికి జిల్లా పార్టీ కార్యాలయానికి వెయ్యి గజాల స్థలమే ఎక్కువ. అలాంటిది రెండు ఎకరాల ఖరీదైన స్థలం కేటాయించడం ఏమిటన్న విమర్శలు తొలి నుంచీ ఉన్నాయి. తాజాగా అసలు ఎలాంటి అనుమతులు తీసుకోకుండా భారీఎత్తున భవన నిర్మాణం చేయడం ఏమిటని సామాన్యులు ప్రశ్నిస్తున్నారు.

రంగా పార్కు నిర్మాణాన్ని కాదని..

ఎన్టీఆర్ జిల్లా వైసీపీ కార్యాలయం కోసం విజయవాడలోని విద్యాధరపురం సితారా జంక్షన్ సమీపంలో గజం లక్ష రూపాయలు పలికే స్థలాన్ని కేటాయించారు. సుమారు 1850 చదరపు గజాల స్థలాన్ని కేటాయంచడంపై అప్పట్లోనే విమర్శలు వెల్లువెత్తాయి. సుమారు రూ.20 కోట్ల విలువ చేసే స్థలాన్ని ఏడాదికి కేవలం రూ.400 లీజు ప్రాతిపదికన 33 ఏళ్లకు కేటాయిస్తూ 2022, డిసెంబరు 20న గుట్టుచప్పుడు కాకుండా జీవో నెంబరు 2418ను విడుదల చేశారు. ప్రస్తుతం ఇక్కడ సెల్లార్ శ్లాబ్ పూర్తయింది. ఈ భవనానికీ ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే నిర్మాణ పనులు చేసేస్తున్నారు. వాస్తవానికి ఈ స్థలంలో రంగా పార్కు ఏర్పాటు చేయాలని ఎప్పటి నుంచో కాపు సంఘాల నాయకులు కోరుతున్నారు. ఆ డిమాండ్‌ను కాదని అప్పటి ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు ఆ స్థలాన్ని పార్టీ కార్యాలయానికి కేటాయించేలా చక్రం తిప్పారు. దీనిపై కాపు సంఘాలు ఆందోళన చేసేందుకు సిద్ధమవుతున్నాయి. ఆ స్థలాన్ని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని వంగవీటి మోహనరంగా పార్కు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

విజయవాడలో నిర్మాణంలో వైసీపీ కార్యాలయం



మరో 9 మందికి..

జగ్గయ్యపేటలో ఆగని డయేరియా కేసులు

జగ్గయ్యపేట, జూన్ 23 : జగ్గయ్యపేటలో ఆదివారం కొత్తగా 9 మంది డయేరియా లక్షణాలు ఆస్పత్రిలో చేరారు. వీరిలో ఆదివారం ఉదయం ఇద్దరి పరిస్థితి ఆందోళనకరంగా ఉండటంతో విజయవాడకు తరలించారు. పట్టణంలో మంగలి బజార్‌కు చెందిన సయ్యద్ జాన్‌బాషా (24), కాకానినగర్‌కు చెందిన టి.సాత్విక్ (9), డాంగేనగర్‌కు చెందిన ఎం.నాగేశ్వరరావు (41), అమ్మాణి కాలేజీ రోడ్డుకు చెందిన కే.ధనుష్ (10), మిట్టగూడేనికి చెందిన వి.నరసమ్మ (45), కాకానినగర్‌కు చెందిన తల్లి కొడుకులు అన్నపూర్ణ, వేణు గోపాల్‌రెడ్డి, వత్సవాయి మండలం భీమవరానికి చెందిన సీహెచ్ దాసయ్య (43), దేచుపాలేనికి చెందిన ఉదయభార్గవ్ (11) డయేరియా లక్షణాలతో ఆసుపత్రిలో చేరారు. ఆసుపత్రిలో మూడు రోజులుగా చికిత్స పొందుతున్న వత్సవాయికి చెందిన నాగేశ్వరరావు (70), చిల్లకల్లుకు చెందిన బి.హసిని (9)లకు విరేచనాలు అదుపులోకి కాకపోవడంతో విజయవాడ జీజీహెచ్‌కు తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ముగ్గురిని డిశ్చార్జ్ చేశారు. చిల్లకల్లు, ముక్కపేట, షేర్‌మహ్మద్‌పేట గ్రామాల్లో నిర్వహిస్తున్న ప్రత్యేక డయేరియా వైద్య శిబిరాల నుంచి ఆదివారం ఒక్క కేసు కూడా రిఫర్ కాలేదని డీఎంహెచ్‌వో డాక్టర్ సుహాసిని తెలిపారు. జగ్గయ్యపేటలో కేసులు జీరో అయ్యే వరకు ఇక్కడే ఉండి పర్యవేక్షిస్తానని ఆమె పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో 38 మంది ఇన్‌పేషంట్లుగా ఉండి చికిత్స పొందుతున్నారు.



జగ్గయ్యపేట ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న డయేరియా బాధితులు

నందిగం సురేష్ సోదరుడి కొడుకుపై కేసు నమోదు

- అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీ స్వాధీనం

విజయవాడ (విద్యాధరపురం), జూన్ 23 : గుంటూరు జిల్లా ఉద్దండరాయునిపాలెం నుంచి విజయవాడలోని భవానీపురానికి అక్రమంగా ఇసుక తరలిస్తున్న మాజీ ఎంపీ నందిగం సురేష్ సోదరుడి కుమారుడు మణికంఠ, కనకమహాలక్ష్మి కాటా యజమాని చక్రవర్తి, టిప్పర్ డ్రైవర్ రాంబాబుపై ఆదివారం భవానీపురం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు ఒక టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని స్టేషన్‌కు తరలించారు. గురువారం అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో ఉద్దండరాయునిపాలెం నుంచి భవానీపురం బైపాస్ రోడ్డు పక్కన మణికంఠ నిర్వహిస్తున్న స్టాండ్ వద్దకు ఎనిమిది ఇసుక లారీలు వచ్చాయి. విషయం తెలుసుకున్న భవానీపురానికి చెందిన తెలుగు యువత నాయకుడు చరణ్ స్టేషన్‌కు ఫోన్ చేసి సమాచారం అందించారు. ఆ తరువాత పోలీసులు, చరణ్, అతని స్నేహితులు లారీలను వెంబడించారు. పోలీసుల రాకతో ఇసుక లోడుతో ఉన్న ఏడు లారీలు వేగంగా వెళ్లిపోయాయి. ఒక లారీ మాత్రం సితార థియేటర్ వెనుక ఖాళీ స్థలంలో పార్కింగ్ చేయడం గమనించిన పోలీసులు అక్కడికి వెళ్లి డ్రైవర్ రాంబాబును అదుపులోకి తీసుకుని లారీని స్టేషన్‌కు తరలించారు. మణికంఠ, చక్రవర్తి, రాంబాబుపై కేసు నమోదు చేశారు.

డయేరియాను కట్టడి చేయండి

మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాలు

గ్రామాల సందర్శన, బాధితులకు పరామర్శ

4లో..



రామతీర్థంలో మూడో శతాబ్ది బౌద్ధ ఆనవాళ్లు

దుర్గమ్మను దర్శించుకున్న శాసనసభ స్పీకర్

4లో..

కబ్జాకాండ!

రూ.100 కోట్ల భూమి వైసీపీ నేతల ఆక్రమణ

కుష్టు వ్యాధిగ్రస్థుల హాస్పిటల్ స్థలం కబ్జా

కుష్టు వ్యాధిగ్రస్తుల వైద్యసేవలకు దాతలు ఇచ్చిన స్థలాన్ని కూడా వైసీపీ నాయకులు వదల్లేదు. అధికారం పోయినా అక్రమాలు ఆపటం లేదు. గన్నవరంలోని అంతర్జాతీయ విమానాశ్రయానికి అభిముఖంగా, 16వ నెంబర్ జాతీయ రహదారి (ఎన్‌హెచ్ - 16) సమీపంలో రూ.100 కోట్లు పలికే 11 ఎకరాల ప్రభుత్వ స్థలంలో స్థానిక వైసీపీ నేత కనుసన్నల్లో ఓ బడాబాబు ఏకంగా పెట్రోల్ బంకు నిర్మాణానికి ఉపక్రమించాడు. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నా రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవటం లేదు. ఈ కబ్జాకాండలో రెవెన్యూ అధికారుల పాత్ర కూడా ఉన్నట్టు తెలుస్తోంది. అక్రమణలను అడ్డుకుని, నిర్మాణాలను తొలగించాలని రెవెన్యూ అధికారులకు స్థానిక ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఆదేశించారు.



కబ్జాకు గురైన స్థలం ఇదే

» అధికారుల సహకారంతోనే అక్రమం
» వైసీపీ నాయకుడి కనుసన్నల్లో ఓ బిగ్‌షాట్ ఆక్రమణ
» లెప్రసీ స్థలంలో పెట్రోల్ బంక్ పనులు
» రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ/గన్నవరం) : కృష్ణాజిల్లా గన్నవరం మండలం కేసరపల్లి గ్రామంలో కుష్టు వ్యాధిగ్రస్తుల వైద్యశాల, వారి సేవార్థం 1936లో మీర్జాపురం జమీందారు 11 ఎకరాల భూమిని దానంగా నాటి బ్రిటీష ప్రభుత్వానికి ఇచ్చారు. ఈ భూమిలో నాటి బ్రిటీష ప్రభుత్వం లెప్రసీ వైద్యశాలను కూడా నిర్మించింది. ఈ వైద్యశాలను 1939లో ప్రారంభించారు. కాలక్రమంలో లెప్రసీ హాస్పిటల్ మూత పడింది. అప్పటి నుంచి ఈ భూములపై అక్రమార్కుల కన్ను పడింది. గతంలో కూడా పలువురు ఈ భూములను ఆక్రమించే ప్రయత్నం చేశారు. అప్పట్లో మీర్జాపురం జమీందారు ఇచ్చిన భూముల్లో ఎకరం భూమిని లెప్రసీ కాలనీకి కేటాయించారు. మిగిలిన భూమిని వైద్యశాల, ఇతర అవసరాల కోసం నిర్మించారు.

● ఆక్రమణకు ప్రయత్నాలు

90వ దశకంలో ఈ భూములను ఆక్రమించేందుకు కొందరు ప్రయత్నించగా బీజేపీ నాయకులు అడ్డుకున్నారు. 90వ దశకం నుంచి ఈ లెప్రసీ వైద్యశాల మూత పడింది. లెప్రసీ కాలనీ అయితే ఆ తర్వాత ఓ అర దశాబ్దంపాటు కొనసాగింది. కాలక్రమంలో విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం అభివృద్ధి చెందటం, ఐటీ పార్కులు చుట్టుపక్కల ఏర్పడటంతో కేసరపల్లికి అనూహ్యంగా డిమాండ్ ఏర్పడింది. దీనికి తోడు మేధ ఐటీ పార్క్, హెచ్‌సీఎల్ వంటి వాటితో కేసరపల్లిలో భూములకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ఇప్పుడు ఈ భూముల ధర రూ.100 కోట్లు ఉంటుంది. దీంతో ఇక్కడి భూములపై మళ్లీ అక్రమార్కుల కన్ను పడింది. గతంలో ఇదే ప్రాంతం దగ్గర్లో పులికుంటను కూడా ఆక్రమించుకున్నారు. పొజిషన్ పట్టాలు ఇచ్చేందుకు గన్నవరం రెవెన్యూ అధికారుల సహకారంతో పెద్ద స్కెచ్ వేశారు. ఈ వ్యవహారాన్ని 'ఆంధ్రజ్యోతి' బయటకు తీయటంతో ఆగిపోయింది. ఇప్పటికీ పులికుంటను సాగుదారులకు పట్టాలు ఇప్పించి వారి నుంచి కొనుగోలు చేసేందుకు బడా బిల్డర్ సిద్ధంగా ఉన్నాడు. ఇదే కోవలో వైసీపీ నేత అండతో.. సరిగ్గా ఎన్నికలకు ముందే ఈ స్థలాన్ని కబ్జా చేసేందుకు వ్యూహం పన్నారు.

● పెట్రోల్ బంకు నిర్మాణానికి యత్నం

కబ్జాను అధికారికం చేసుకునేందుకు రెవెన్యూ అధికారుల సహకారంతో రికార్డులను ట్యాంపరింగ్ చేశారు. రికార్డుల ట్యాంపరింగ్‌తో దొంగ పట్టాలను సృష్టించినట్టు తెలిసింది. వీటి అండతో.. ఓ బిగ్‌షాట్ ఇక్కడ పెట్రోల్ బంకును నిర్మించేందుకు సన్నద్ధమయ్యాడు. ఈ వివాదాస్పద స్థలంలో పెట్రోల్ బంకుకు అనుమతులు ఎలా వచ్చాయన్నది పెద్ద మిస్టరీగా ఉంది. పెట్రల్ బంకు నిర్మాణం కోసం ముందుగా.. ఆ స్థలంలో నీటి అవసరాల కోసం బోర్లు ఏర్పాటు చేసే పనులు ప్రారంభించారు. ఇంత దర్జాగా పనులు జరుగుతున్నా.. ఎవరూ నోరు మెదపటం లేదు. ఈ కబ్జాపై వల్లూరు చక్రవర్తి అనేక స్థానికుడు తహసీల్దార్‌కు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు ఇచ్చినా పట్టించుకోలేదు. వారం రోజులుగా రెవెన్యూ అధికారులు తూతూ మంత్రపు చర్యలే చేపడుతున్నారు. ఈ భూములకు సంబంధించిన డేటాను తగులబెట్టేయడం మరో సంచలనానికి దారి తీస్తోంది. దీనికి సంబంధించిన రికార్డులను ఎప్పుడు తగల బెట్టారన్నది తేలాల్సి ఉంది. తహసీల్దార్ కార్యాలయం పరిధిలో రికార్డులను తగులబెట్టినప్పటికీ ఈ రికార్డులను సెటిల్‌మెంట్ రిజిస్టర్ కార్యాలయంలో పొందవచ్చు. కాబట్టి ఈ వ్యవహారంలో అసలు దొంగలెవరో తేలుతుంది. కృష్ణాజిల్లా కలెక్టర్ ఈ వ్యవహారంపై తక్షణం విచారణ ప్రారంభించాల్సి ఉంది.

అక్రమ కట్టడాలను అడ్డుకోండి

- రెవెన్యూ అధికారులకు ఎమ్మెల్యే యార్లగడ్డ ఆదేశం

గన్నవరం : గన్నవరం విమానాశ్రయం ఎదురుగా ఉన్న రూ.100 కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమి ఆక్రమణలను అడ్డుకోవాలని ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు రెవెన్యూ అధికారులను ఆదివారం ఒక ప్రకటనలో ఆదేశించారు. వీఆర్వో, ఆర్ఐ, తహసీల్దారు కనుసన్నల్లో ఈ అక్రమణ జరిగినట్టు ఎమ్మెల్యే దృష్టికి పలువురు తీసుకువెళ్లడంతో స్పందించిన యార్లగడ్డ ఆక్రమణలను అడ్డుకుని నిర్మాణ పనులను ఆపాలని ఆదేశించారు.

డయేరియాను కట్టడి చేయండి

- అధికారులతో మంత్రి సత్యకుమార్
- గ్రామాల సందర్శన, బాధితులకు పరామర్శ

వత్సవాయి, జూన్ 23 : జగ్గయ్యపేటలో డయేరియా ప్రబలిన మక్కపేట గ్రామాన్ని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదివారం సందర్శించారు. పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డయేరియా రోగులకు అందుతున్న సేవలపై ఆరాతీశారు. కావాల్సిన మందులు అందుబాటులో ఉంచుకొని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో డయేరియా అదుపు చేసేందుకు పనిచేయాలని ఆదేశించారు. ప్రస్తుతం మండల పరిధిలో 10 మంది వ్యాధి లక్షణాలతో ఇబ్బంది పడుతున్నారని వీరందరికీ మెరుగైన వైద్యం అందించేందుకు జగ్గయ్యపేట తరలించినట్లు స్థానిక వైద్యులు మంత్రికి వివరించారు. ఆయన వెంట హెల్త్ కమిషనర్ ఎంటీ కృష్ణబాబు, ఎమ్మెల్యే శ్రీరామ్ రాజగోపాల్, సర్పంచ్ మల్లెల శివ ప్రసాద్, మెడికల్, రెవెన్యూ, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు పాల్గొన్నారు.


ప్రభుత్వాసుపత్రిలో డయేరియా వార్డును పరిశీలించిన ఎంపీ కార్యాలయ ఓఎస్డీ తదితరులు

రోజు రోజుకు డయేరియా వ్యాధిగ్రస్థుల సంఖ్య నమోదు కావడంతో అధికారులు పరుగులు పెడుతున్నారు. పారిశుధ్య పనులతో పాటు తాగునీటిని ట్యాంకుల ద్వారా సరఫరా చేస్తున్నారు. మండలంలోని 25 గ్రామ పంచాయతీల పరిధిలో ఆశా వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది ఇంటింటి సర్వే చేపట్టారు. సీహెచ్‌వో మల్లికార్జున్, ఎంపీహెచ్‌వో ఉషారాణి ఆధ్వర్యంలో సర్వే నిర్వహిస్తున్నారు. ప్రత్యేక శిబిరంలో వైద్యులు నాగమణి, హర్షిత, సీతారావమ్మ, అలేఖ్యలు రోగులకు సేవలందిస్తున్నారు.

బాధితుల ఆరోగ్య పరిస్థితిపై ఎంపీ చిన్ని ఆరా

వన్‌టౌన్ : విజయవాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్న డయేరియా రోగుల ఆరోగ్య పరిస్థితి గురించి ఢిల్లీలో ఉన్న విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) ఆదివారం ఆరా తీశారు. రోగులకు ఎటువంటి సదుపాయాలు, సౌకర్యాలు ఉన్నాయో తనకు తెలియజేయాలని ఓఎస్డీని ఆదేశించారు. ఈ మేరకు ఓఎస్డీతో పాటు కార్యాలయ సిబ్బంది రోగులు చికిత్స పొందుతున్న ప్రత్యేక వార్డును సందర్శించి వివరాలు సేకరించారు. వార్డులో 31 బెడ్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు. 24 గంటలు ఆక్సిజన్ అందుబాటులో ఉందని శ్రీనివాసరావు వెల్లడించారు. పరిస్థితులను బట్టి అదనపు బెడ్లను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. 24 గంటల పాటు ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్, ముగ్గురు డాక్టర్లు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఎవరూ భయాందోళన చెందాల్సిన అవసరం లేదని, పరిసరాల పరిశుభ్రతను పాటించడంతో పాటు కాచి చల్లార్చిన నీటినే తాగాలని నాని నియోజకవర్గ ప్రజలకు సూచించారు.


స్పీకర్‌కు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారులు

దుర్గమ్మను దర్శించుకున్న శాసనసభ స్పీకర్

వన్‌టౌన్, జూన్ 23 : రాష్ట్ర శాసనసభ స్పీకర్‌గా బాధ్యతలు చేపట్టిన అనంతరం చింతకాయల అయ్యన్నపాత్రుడు తొలిసారిగా కుటుంబసభ్యులతో కలిసి ఆదివారం ఇంద్రకీలాద్రికి విచ్చేశారు. ఈవో కేఎస్ రామారావు, అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో సాదర స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం అయ్యన్నపాత్రుడు ఆయన కుటుంబసభ్యులకు వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు.

దుర్గమ్మ సేవలో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి



దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో కనకదుర్గమ్మను ఆదివారం కర్ణాటక రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.శివానంద దర్శించుకున్నారు. ఆయనకు ఈవో కేఎస్ రామారావుఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించగా.. వేద పండితులు వేదాశీర్వచనం చేశారు.

దుర్గమ్మ సన్నిధిలో సీఎస్ నీరబ్



విజయవాడ : రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ తన కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం ఇంద్రకీలాద్రిపైనున్న కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. అధికారులు, అర్చకులు ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం ఆయన పేరిట అర్చకులు ప్రత్యేక అర్చనలు చేశారు. వేదపండితులు ఆయనకు ఆశీస్సులు అందజేయగా ఈవో రామారావు నీరబ్‌కుమార్ ప్రసాద్ దంపతులకు దుర్గమ్మ శేషవస్త్రం, ప్రసాదం, చిత్రపటం అందజేశారు.

దుర్గమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే శ్రావణకుమార్

వన్‌టౌన్: ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ దర్శనార్థం ఆదివారం ఎమ్మెల్యే తెనాలి శ్రావణకుమార్ విచ్చేశారు. అర్చకులు, ఈవో కేఎస్ రామారావు ఆయనకు సాదర స్వాగతం పలికారు. ఆయనకు అమ్మవారి దర్శనం కల్పించిన అనంతరం వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. అమ్మవారి ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రం ఆయనకు అందజేశారు.

నిత్యాన్నదానానికి విరాళం

పశ్చిమ గోదావరి జిల్లా భీమవంలోని జేపీ రోడ్డుకు చెందిన డాక్టర్ శ్రీవాసుదేవ చక్రవర్తి ఆయన కుటుంబసభ్యులు ఆదివారం ఆలయానికి విచ్చేసి ఏఈవో రమేష్‌కు చెక్కు రూపంలో రూ.1,01,116 విరాళాన్ని డాక్టర్ వెంకటపతిరాజు పేరిట అన్నవితరణజరిపేందుకు విరాళం అందజేశారు. అమ్మవారి దర్శనానంతరం దాత కుటుంబానికి వేద పండితులు వేదాశీర్వచనం చేయగా అధికారులు వారికి దుర్గమ్మ ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు.



ఆదివారం నాడు అర్చక బృందం అరుణపారాయణం నిర్వహించింది. సమస్త జనులకు ఆయురారోగ్యాలను ప్రసాదించాలని సంకల్పిస్తూ సూర్యనారాయణమూర్తికి అర్చనలు నిర్వహించారు. అనంతరం తర్పణం సమర్పించారు. ఆదివారం సెలవుదినం కావడంతో భక్తులు దుర్గమ్మ దర్శనార్థం పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. సాయంత్రం దుర్గగుడిలో ధర్మపథం వేదికపై హైదరాబాద్‌కు చెందిన జి.కుమారి ఆధ్వర్యంలోని శ్రావణి నృత్య కళానిలయ కళకారుల బృందం కూచిపూడి నృత్యప్రదర్శన చేసి భక్తుల హర్షధ్వానాలు అందుకున్నారు. ఐదు కీర్తనలకు కళాకారులు అభినయ కౌశలాన్ని ప్రదర్శించారు.

వెంకయ్యనాయుడుతో ఎంపీ కేశినేని శివనాథ్ భేటీ



వన్‌టౌన్, జూన్ 23 : మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడును న్యూఢిల్లీలోని ఆయన నివాసంలో ఆదివారం విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) మర్యాదపూర్వకంగా కలిసారు. పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం సందర్భంగా ఢిల్లీ వెళ్లిన చిన్ని వెంకయ్యనాయుడును కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఈ సందర్భంగా శివనాథ్‌ను వెంకయ్యనాయుడు అభినందించారు. రాష్ట్ర రాజకీయాల గురించి చర్చించడంతో పాటు కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన నిధులను రాబట్టే విషయంలో అనుసరించాల్సిన విధివిధానాలపై వెంకయ్య నుంచి శివనాథ్ సూచనలు పొందారు.

రామతీర్థంలో మూడో శతాబ్ది బౌద్ధ ఆనవాళ్లు

విజయవాడ కల్చరల్, జూన్ 23 (ఆంధ్రజ్యోతి) : ప్రకాశం జిల్లా చీమకుర్తి మండలం రామతీర్థంలోని శ్రీమోక్ష రామలింగేశ్వరాలయంలో క్రీ.శ. మూడో శతాబ్దం నాటి బౌద్ధ ఆనవాళ్లను ప్లీచ్ ఇండియా సీఈవో ఈమని శివనాగిరెడ్డి గుర్తించారు. ఈ జిల్లాలో వారసత్వ సంపదను పరిరక్షించి భావితరాలకు అందించాలన్న అవగాహన కార్యక్రమంలో ఆదివారం ఆయన రామతీర్థంలో పర్యటించారు. ఆలయం వెనుక వైపున ఉన్న శివలింగాల మధ్య పల్నాటి సున్నపురాతి బౌద్ధ స్తంభాన్ని, దానిపై అర్థచంద్రకార పద్మాన్ని కనుగొన్నారు. ఈ శిల్పం ఇక్ష్వాకుల కాలం నాటిదని గుర్తించారు. ఈ సందర్భంగా శివనాగిరెడ్డి మాట్లాడుతూ, వేంగ చాళుక్యుల కాలంలో ఈ స్తంభాన్ని బ్రహ్మసూత్రాలు చెక్కి, శివలింగంగా మార్చి బిగించారని పేర్కొన్నారు. మరో రెండు శివలింగాలు, క్రీ.శ. 16వ శతాబ్దానికి చెందిన వీరభద్ర విగ్రహం నిరాదరణకు గురయ్యాయని ఆయన పేర్కొన్నారు.


శిల్పాలను పరిశీలిస్తున్న ఈమని శివనాగిరెడ్డి



మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి ఉద్యోగుల సత్కారం

వన్‌టౌన్, జూన్ 23 : రవాణా శాఖ మంత్రిగా ఆదివారం సచివాలయంలోని 4వ బ్లాకులో బాధ్యతలు స్వీకరించిన మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డిని ప్రజారవాణా సంస్థ నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎంయూ) అసోసియేషన్ ప్రతినిధులు గజమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అసోసియేషన్ ప్రధానకార్యదర్శి వై.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు శ్రీనివాసరాజు, ఎస్.వి రమణ, కోశాధికారి పి.వి మోహన్, సంయుక్త కార్యదర్శి రాజేష్ కుమార్, మహిళా కార్యదర్శులు సుజాత, భద్రావతి పాల్గొన్నారు.

ప్రజలు సుఖశాంతులతో ఉండాలని..

- ఆలయాల్లో మంత్రి రవీంద్ర అర్చనలు

మచిలీపట్నం టౌన్, జూన్ 23 : జిల్లా ప్రజలు సుఖశాంతులతో ఉండాలని రాష్ట్ర గనులు, ఎక్సైజ్, జుయాలజీ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర ఆదివారం పలు ఆలయాల్లో ప్రత్యేక అర్చనలు చేశారు. చిలకలపూడి పాండురంగ స్వామి దేవాలయానికి రవీంద్ర శిరస్సుపై స్వామివారికి అర్చన సామగ్రిని తీసుకువెళారు. పాండురంగ స్వామికి అర్చనలు జరిపారు. కరగ్రహారంలో ఫరీద్‌బాబా దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బందరుకోట కోదండ రామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమాలలో టీడీపీ సీనియర్ నేత గొర్రెపాటి గోపీచంద్, గోపు సత్యనారాయణ, మోటమర్రి బాబా ప్రసాద్, పంచపర్వాల కాశీవిశ్వనాధం, తలారి సోమశేఖర్, నగర టీడీపీ కార్యదర్శి పిప్పళ్ల కాంతారావు తదితరులు పాల్గొన్నారు.


పాండురంగ స్వామి ఆలయంలో రవీంద్ర ప్రత్యేక పూజలు

● మంత్రి కొల్లు రవీంద్ర సోమవారం ఉదయం 7.50 గంటలకు రాష్ట్ర సచివాలయంలో బాధ్యతలు స్వీకరించనున్నారు. 3వ నెంబరు బ్లాకు 207వ గదిలో వేదపండితుల ఆశీర్వచనాలతో ప్రమాణ స్వీకారం చేయనున్నారు.


మంత్రిని సత్కరిస్తున్న నెట్టెం, తాతయ్య

మంత్రికి నేతల శుభాకాంక్షలు

జగ్గయ్యపేట : రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం జగ్గయ్యపేట విచ్చేసిన సత్యకుమార్ యాదవ్‌కు విజయవాడ పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నెట్టెం రఘురాం, ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, మాజీ ఛైర్మన్ శ్రీరాం సుబ్బారావు, ఛైర్మన్ రాఘవేంద్ర, బీజేపీ నేతలు మన్నె శ్రీనివాసరావు, శ్రీకాంత్, శ్రీవాణి తదితరులు స్వాగతం పలికారు. జగ్గయ్యపేటలో బ్లడ్‌బ్యాంకు ఏర్పాటు చేయాలని మునిసిపల్ ఛైర్మన్ రాఘవేంద్ర మంత్రికి వినతిపత్రం అందజేశారు. అనంతరం బీజేపీ నేత మన్నె శ్రీనివాసరావు నివాసానికి వెళ్లి బీజేపీ కార్యకర్తలతో కాసేపు గడిపారు. ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య నివాసంలో విందుకు హాజరయ్యారు.

నేటినుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ప్రారంభం

మచిలీపట్నం, జూన్ 23 (ఆంధ్రజ్యోతి) : కలెక్టరేట్‌లో సోమవారం నుంచి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(స్పందన)కార్యక్రమంలో భాగంగా ప్రజలనుంచి అర్జీలు స్వీకరించనున్నట్లు కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాధారణ ఎన్నికల నిర్వహణ, ఎన్నికలకోడ్ అమలులో ఉండటంలో దాదాపుగా రెండు నెలలపాటు ఈ కార్యక్రమాన్ని నిలిపివేయడం జరిగిందని ఆయన అన్నారు. సోమవారం నుంచి కలెక్టరేట్‌లో, డివిజన్, మండలకేంద్రాల్లో ఈ కార్యక్రమాన్ని పునఃప్రారంభిస్తున్నట్టు ఆయన తెలిపారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు.

క్రీడలకు పూర్వ వైభవం

- ఎమ్మెల్యే బొండా ఉమా
- ఘనంగా ఉమ్మడి కృష్ణా ఒలింపిక్ డే రన్

విజయవాడ స్పోర్ట్స్, జూన్ 23: రాష్ట్రంలో క్రీడలకు పూర్వ వైభవం వచ్చిందని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. ఉమ్మడి కృష్ణాజిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఒలింపిక్ డే రన్‌కు ఐజీఎం స్టేడియంలో ఆదివారం ఆయన జెండా ఊపి, క్రీడాజ్యోతిని వెలిగించి ప్రారంభించారు. రోలర్ స్కేటింగ్ అంతర్జాతీయ క్రీడాకారులు మాత్రపు జెస్సీరాజ్, తేజేష్ రన్‌లో ఆకర్షణగా నిలిచారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు సీఎంగా పనిచేసిన చంద్రబాబు హయాంలో హైదరాబాద్‌లో నేషనల్ గేమ్స్‌ను నిర్వహించారని గుర్తు చేస్తూ రానున్న రోజుల్లో విజయవాడ, అమరావతిలో మరిన్ని అంతర్జాతీయ స్టేడియాలు నిర్మించి స్పోర్ట్స్ సిటీలు, కాంప్లెక్సుల నిర్మాణానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తుందన్నారు. అంతర్జాతీయ స్థాయిలో స్కేటింగ్‌లో రాణించిన జెస్సీరాజ్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. జెస్సీరాజ్, తేజేష్‌లకు ఎన్‌బీకే ట్రస్ట్ ఛైర్మన్, ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు నాదెళ్ల బ్రహ్మాజీరావు రూ.5వేల ఆర్థిక సాయాన్ని బొండా ఉమా చేతుల మీదుగా అందజేశారు.

ఉత్సాహంగా రన్

రానున్న పారిస్ ఒలింపిక్స్‌లో భారత్ తరఫున ఏపీ నుంచి భారీగా పతకాలను సాధించాలని కోరుతూ నిర్వహించిన ఒలింపిక్ డే రన్ ఐజీఎంసీ నుంచి బెంజిసర్కిల్ వరకు జరిగింది. కోచ్‌లు, వివిధ అసోసియేషన్ల ప్రతినిధులు, క్రీడాకారులు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. బిషప్ అజరయ్య స్కూల్ విద్యార్థులు డప్పు వాయిద్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి పద్మజాబాల, ఉపాధ్యక్షులు సులోచన,రాజేంద్రప్రసాద్,ఈసీ మెంబర్లు రవిశంకర్, దయాకర్, రామరావు, గౌరీశంకర్ పాల్గొన్నారు.


ఒలింపిక్ డే రన్ ప్రారంభిస్తున్న బొండా ఉమా

బాబుతోనే దళిత, గిరిజనుల అభివృద్ధి

- ఏపీ దళిత, గిరిజన జేఏసీ


మాట్లాడుతున్న మేళం భాగ్యారావు

ధర్నాచౌక్, జూన్ 23 : గత వైసీపీ ప్రభుత్వం రద్దు చేసిన దళితులకు సంబంధించిన 27 సంక్షేమ పథకాలను అమలు చేయాలని ఏపీ దళిత గిరిజన జేఏసీ నేతలు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వంలో దళిత, గిరిజనుల అభివృద్ధి జరుగుతుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో వివిధ దళిత, గిరిజన సంఘాల రౌండ్‌టేబుల్ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా రాష్ట్రంలో ఏర్పాటైన నూతన ప్రభుత్వంతో కలిసి పని చేయడానికి, దళిత, గిరిజనుల హక్కులు, పథకాలు, రక్షణకు ఏపీ దళిత, గిరిజన జేఏసీ ఏర్పాటైందని, త్వరలోనే సమావేశం ఏర్పాటు చేసుకుని పూర్తి కార్యవర్గాన్ని ఎన్నుకోవడం జరుగుతుందని నేతలు పేర్కొన్నారు. దళిత వేదిక రాష్ట్ర అధ్యక్షుడు వంగిపురపు రెడ్డన్న ఆధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో దళిత బహుజన ఫ్రంట్ వ్యవస్థాపక అధ్యక్షుడు కొరివి వినయ్‌కుమార్, ప్రధానకార్యదర్శి మేళం భాగ్యారావు, రాష్ట్ర నేతలు వి.దుర్గాప్రసాద్, రెడ్డి రవణమ్మ, కోసనం రాము తదితరులు పాల్గొన్నారు.



సీటీజీఈవోఏ నూతన కార్యవర్గం

విజయవాడ, జూన్ 23(ఆంధ్రజ్యోతి) : సెంట్రల్ జీఎస్టీ గుంటూరు కమిషనరేట్ పరిధిలో ఐదు జిల్లాల సెంట్రల్ టాక్స్ గెజిటెడ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఆదివారం ఎన్నికైంది. కృష్ణా, గుంటూరు, పశ్చిమగోదావరి, ప్రకాశం, నెల్లూరు జిల్లాల పరిధిలో ఉండే ఈ కార్యవర్గం అధ్యక్షుడిగా బి.నవీన్‌రాజు, ప్రధాన కార్యదర్శిగా కె.యుగంధర్ కుమార్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా సీహెచ్ ఈశ్వరరావు, బి.సుకుమార్, సంయుక్త కార్యదర్శులుగా ఎం.శ్రీకాంత్, సీహెచ్ కన్నారావు ఎన్నికవ్వగా, కోశాధికారిగా మిక్కిలినేని శ్రీనివాస్, లైజనింగ్ కార్యదర్శిగా టీవీజీకే మూర్తి, జేసీఎం సభ్యురాలిగా బి.శ్రీలక్ష్మి మెంటార్‌గా ఎం.నాగరాజు ఎన్నికయ్యారు.

గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గం

మొగల్రాజపురం, జూన్ 23 : ఆంధ్రప్రదేశ్ కమర్షియల్ టాక్సెస్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (ఏపీసీటీజీవోఏ) సర్వసభ్య సమావేశం ఆంధ్రా మోటార్ మర్చంట్స్ అసోసియేషన్ (అమ్మ) హాలులో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా జరిగిన ఎన్నికల్లో కొత్త కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా తోట రాజశేఖర్ (జాయింట్ కమిషనర్), ఉపాధ్యక్షుడు-1గా కోట శ్రీధర్ (అసిస్టెంట్ కమిషనర్) ఉపాధ్యక్షుడు-2గా అల్లెన రమేష్‌కుమార్ (డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్), జనరల్ సెక్రటరీగా కొరుప్రోలు మురళీకృష్ణ (డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్) ఎన్నికయ్యారు. అనంతరం కొత్త కార్యవర్గ సభ్యులు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. వాణిజ్యపన్నుల శాఖకు సంబంధించిన 500 మంది అధికారులు పాల్గొన్నారు.




ప్రభుత్వ ఉద్యోగుల సంఘ సమావేశంలో మాట్లాడుతున్న రాము

ఎన్యూమరేషన్ బకాయిలు చెల్లించండి

మచిలీపట్నం టౌన్, జూన్ 23 : ఎన్నికల సమయంలో విధులు నిర్వహించిన ఉద్యోగులకు ఎన్యూమరేషన్ బకాయిలను వెంటనే చెల్లించాలని జిల్లా ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రాము డిమాండ్ చేశారు. ఆదివారం మాచవరంలోని ప్రభుత్వ ఉద్యోగుల కార్యాలయం వద్ద జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. సమావేశంలో నూతన ప్రభుత్వం ఉద్యోగులకు ఇవ్వవలసిన బకాయిలను చెల్లించాలని, 12వ పీఆర్సీ కమిషన్ ఏర్పాటు చేసి మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి తోట వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయాల్లో రోశయ్యది విశిష్ట స్థానం

- విగ్రహావిష్కరణలో మండలి బుద్ధప్రసాద్

అవనిగడ్డ, జూన్ 23 : రాష్ట్ర రాజకీయ చరిత్రలో రోశయ్య స్థానం విశిష్టమని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. ఆదివారం అవనిగడ్డలో ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య విగ్రహాన్ని బుద్ధప్రసాద్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రోశయ్య స్వయంకృషితో ఉన్నత స్థాయికి చేరుకుని రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను చక్కబెట్టిన గొప్ప ఆర్థిక మంత్రిగా ఖ్యాతి పొందారన్నారు. ఆర్థిక మంత్రిగా 16 సార్లు బడ్జెట్ ప్రవేశ పెట్టినా ఏనాడూ ఓవర్ డ్రాఫ్ట్‌కు వెళ్లని ఏకైక నాయకుడు రోశయ్య అని తెలిపారు. అధికార పక్షంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా ఉత్తమ పార్లమెంటేరియన్‌గా కొణిజేటి రోశయ్య గుర్తింపు పొందారని, ఆయన జీవితం యువ ఎమ్మెల్యేలకు అధ్యయన గ్రంథమన్నారు. రాష్ట్రంలో కొణిజేటి రోశయ్య స్మృతి చిహ్నం ఏర్పాటు చేస్తామన్నారు. విగ్రహ నిర్మాణ కమిటీ కన్వీనర్ ఘంటసాల రాజమోహన్ (కన్నయ్య) అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో నియోజకవర్గ యువనేత మండలి వెంకట్రామ్, ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ మాజీ వైస్ చాన్సలర్ ముత్యాల నాయుడు, రోశయ్య వ్యక్తిగత కార్యదర్శి ఉమ్మారెడ్డి రామారావు, ఆరు మండలాల ఆర్యవైశ్య నాయకులు పాల్గొన్నారు.


రోశయ్య విగ్రహాన్ని ఆవిష్కరించిన మండలి బుద్ధప్రసాద్

సిబార్ డెంటల్ కాలేజీ చైర్మన్ అట్లూరి రవీంద్రనాథ్ ఠాగూర్ మృతి



వన్‌టౌన్, జూన్ 23 : సిబార్ డెంటల్ కాలేజీ చైర్మన్, అశ్వనీ నర్సింగ్ హోమ్ నిర్వాహకులు అట్లూరి రవీంద్రనాథ్ ఠాగూర్ ఆదివారం మృతి చెందారు. ఆయనకు భార్య డాక్టర్ దుర్గారాణి, ఇద్దరు కుమారులు డాక్టర్ వినయ్, శ్రీకాంత్‌లు ఉన్నారు. సోమవారం ఉదయం 11 గంటలకు దుర్గా అగ్రహారంలోని ఆయన స్వగృహం నుంచి అంతియాత్ర ప్రారంభం కానున్నదని కుటుంబ సభ్యులు తెలిపారు.

మహిళ అవయవదానం



గుడివాడ, జూన్ 23 : స్థానిక నాగవరప్పాడుకు చెందిన మైనపు ధనలక్ష్మి(48) అనారోగ్యంతో విజయవాడలోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం బ్రెయిన్ డెడ్‌తో మృతి చెందింది. ఆమె భర్త ఏసుబాబు, కుమారులు ఆనంద్‌కుమార్, అశోక్‌కుమార్‌లు ఆవయవదానం చేయడానికి ముందుకురావడంతో చెన్నైకి చెందిన జీవన్ దాన్ ద్వారా అవయవాలను దానం చేశారు. ధనలక్ష్మి కుటుంబసభ్యులను పలువురు ప్రశంసించారు.


మాట్లాడుతున్న తలశిల స్వర్ణలత

అత్యాచారాలకు పాల్పడితే కఠిన చర్యలే..

- జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు స్వర్ణలత

నాగాయలంక, జూన్ 23 : ప్రకాశం జిల్లా చీరాల మండలం ఈపూరుపాలెంలో ఇటీవల మహిళను ముగ్గురు యువకులు అత్యాచారం చేసి హత్య చేసిన ఉదంతం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి రాగా, హోంమంత్రి వంగలపూడి అనిత వెంటనే స్పందించి బాధిత కుటుంబాన్ని పరామర్శించి 48 గంటల్లోగా నిందితులను పట్టుకుంటామని.. బాధిత కుటుంబానికి రూ.10 లక్షల ఆర్థిక సహాయాన్ని చేసి ఆ కుటుంబానికి ధైర్యాన్నిచ్చి వచ్చారని తెలుగు మహిళా కృష్ణాజిల్లా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత తెలిపారు. 36 గంటల్లోనే నిందితులను అరెస్టు చేయటం జరిగిందని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో మహిళలపై ఎన్ని అఘాయిత్యాలు జరిగినా నాటి ముఖ్యమంత్రి గానీ, హోంమంత్రి గానీ స్పందించిన దాఖలాలు లేవని ఆమె విమర్శించారు. తెలుగుదేశం ప్రభుత్వం మహిళలకు రక్షణగా నిలుస్తుందన్నారు. ముఖ్యమంత్రికి, హోంమంత్రికి ధన్యవాదాలు తెలుపుతున్నామని స్వర్ణలత అన్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	138, 147, 158
చికెన్ విత్ స్కిన్	268
చికెన్ స్కిన్‌లెస్	278

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 5.15

గ్రామాల్లో కార్పొరేట్ వైద్య సేవలు అభినందనీయం



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

ప్రొద్దుటూరు (కంకిపాడు), జూన్ 23 : గ్రామీణ ప్రాంతాల్లో కార్పొరేట్ వైద్యం అందించటం హర్షణీయమని మండల టీడీపీ నాయకులు వీరంకి పావనమూర్తి అన్నారు. మండలంలోని ప్రొద్దుటూరు గ్రామంలో శ్రీలక్ష్మీహాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని పావనమూర్తి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు ఈడ కోటేశ్వరరావు, పలగాని శివశంకర్, బొడ్డు చింతయ్య, పోగుల వెంకయ్య, వీరంకి రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రజాధనం వృథా!

- టీడీపీ హయాంలో ఆత్కూరులో పలు అభివృద్ధి పనులకు శ్రీకారం
- వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఐదేళ్లుగా ముందుకు సాగని వైనం
- 50నుంచి 80శాతం వరకు భవన నిర్మాణాల పూర్తి
- కాంట్రాక్టర్లకు బిల్లులు రాక నిలిచిపోయిన పనులు
- నిరుపయోగంగా భవనాలు





బిల్లులు రాక నిలిచిపోయిన పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణం.. పిచ్చిమొక్కలతో దర్శనమిస్తున్న పీహెచ్‌సీ

ఉంగుటూరు, జూన్ 23 : మండలంలో టీడీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన పలు అభివృద్ధి పనులు వైసీపీ ప్రభుత్వం వచ్చాక ముందుకు సాగక ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. చేసిన పనులకు ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో కాంట్రాక్టర్లు చేతులెత్తేశారు. కోట్లు ఖర్చుచేసి చేపట్టిన ప్రజోపయోగ భవన నిర్మాణాలు పూర్తిచేయకుండా నిరుపయోగంగా మార్చడంలో వైసీపీ ప్రభుత్వం తీరుపై ప్రజలు మండిపడుతున్నారు.

ఆత్కూరు గ్రామాన్ని సమగ్రంగా అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో 2017-18సంవత్సరంలో టీడీపీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, అప్పటి ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు సహకారంతో గ్రామంలో వివిధ అభివృద్ధిప నులు చేపట్టేందుకు శ్రీకారం చుట్టారు. రూ. 1.24కోట్లతో మినీ ఆడిటోరియం, రూ. 24కోట్లతో ఏలూరు కాలువపై బ్రిడ్జి నిర్మాణం, రూ. 1.30 కోట్లతో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం, రూ. 1.24 కోట్లతో పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణం, రూ. 30లక్షలతో రామాలయం నిర్మాణం, రూ. 2.50కోట్లతో గ్రామంలోని మూడు చెరువుల సుందరీకరణ పనులు చేపట్టారు. కాంట్రాక్టర్లు యుద్ధప్రాతిపదికన నిర్మాణ పనులు ప్రారంభించారు. సుమారు 50 నుంచి 80శాతం మేర భవన నిర్మాణాలు పూర్తి చేశారు. 2019లో అధికారంలో వచ్చిన వైసీపీ ప్రభుత్వం కాంట్రాక్టర్లు చేసిన పనులకు బిల్లులు చెల్లించకపోవడంతో, మిగిలిన పనులకు బ్రేక్ పడింది. దీంతో ప్రారంభానికి నోచుకోకుండానే పలు భవన నిర్మాణాలు శిథిలావస్థకు చేరుకునే దుస్థితి దాపురించిందని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్లు గడుస్తున్నా బిల్లులు రాక, తెచ్చిన అప్పులకు వడ్డీలు కట్టలేక తీవ్ర ఇబ్బందులు పడుతు న్నా మని కాంట్రాక్టర్లు వాపోతున్నారు. పెండింగ్ పనులు పూర్తిపై వైసీపీ ప్రభుత్వం దృష్టి సారించలేదని, టీడీపీ ప్రభుత్వమైనా పెండింగ్‌లో వున్న నిర్మాణాలు పూర్తిచేయాలని ప్రజలు కోరుతున్నారు.





ప్రారంభానికి నోచుకోని మినీ ఆడిటోరియం.. నిలిచిపోయిన ఏలూరు కాలువపై బ్రిడ్జి నిర్మాణ పనులు

నున్నలో స్కాలర్‌షిప్‌ల పంపిణీ



స్కాలర్ షిప్‌లు పంపిణీ చేస్తున్న ఫాదర్ కిషోర్

విజయవాడ రూరల్, జూన్ 23 : పేద విద్యార్థులను ఆదుకునేందుకు స్వచ్ఛంద సంస్థలు, దాతలు ముందుకు రావాలని లయోలా కళాశాల ప్రిన్సిపాల్ ఫాదర్ కిషోర్ పిలుపునిచ్చారు. విజయవాడ రూరల్ మండలం నున్నలోని ప్రదీప్ ఫార్మ్స్ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 70 మంది పేద విద్యార్థులకు రూ. 5 లక్షలు స్కాలర్ షిప్‌లను అందజేశారు. అనంతరం ప్రదీప్ ఫార్మ్స్ అధినేత ప్రదీప్ మాట్లాడుతూ, త్వరలో 100 మంది పేద విద్యార్థులకు స్కాలర్ షిప్‌లు పంపిణీ చేయడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

మొక్కు తీర్చుకున్న శ్రీనివాసరెడ్డి



మొక్కుతీర్చుకున్న టీడీపీ నేత ఆళ్ల శ్రీనివాసరెడ్డి

చలివేంద్రపాలెం (కంకిపాడు), జూన్ 23 : పెనమలూరు నియోజకవర్గ ఎమ్మెల్యేగా బోడె ప్రసాద్ గెలుపొందడంతో చలివేంద్రపాలెం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు ఆళ్ల శ్రీనివాసరెడ్డి తన మొక్కు తీర్చుకున్నారు. చలివేంద్రపాలెం నుంచి మంటాడ వెంకటేశ్వర స్వామి ఆలయానికి ఆదివారం ఉదయం కాలినడకన వెళ్లి తన మొక్కు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వైసీపీ అరాచకపాలన అంతమై, చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా, బోడె ప్రసాద్ ఎమ్మెల్యే అయితే తాను చలివేంద్రపాలెం నుంచి మంటాడ వెంకటేశ్వరస్వామి దేవాలయానికి కాలినడకన వస్తానని మొక్కుకోవడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త యలమంచిలి కిషోర్‌బాబు, మెట్లపల్లి శ్రీనివాస్, షేక్ జిలాని, కొమరవోలు సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించొద్దన్నందుకు ఉలితో దాడి

గన్నవరం, జూన్ 23 : ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించిన వ్యక్తిని తప్పుకోమన్నందుకు ఉలితో పొడిచిన సంఘటన స్థానిక వెంకటేశ్వర థియేటర్ సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పామర్తి నగర్‌కు చెందిన శ్రీనివాసరావు కార్పెంటర్‌గా పనిచేస్తుంటాడు. ఆదివారం సాయంత్రం వెంకటేశ్వరథియేటర్ సమీపంలోని దావాజీగూడెం రోడ్డులో శ్రీనివాసరావు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించాడు. అందరూ తప్పుకోమని చెప్పారు. అక్కడే ఉన్న చిగురుపాటి సాంబశివరావు కూడా చెప్పాడు. శ్రీనివాసరావు అక్కడ నుంచి వెళ్లిపోయి కొద్దిసేపటి తరువాత వచ్చి ఏంటి నువ్వు మాట్లాడింది అంటూ తనతో తెచ్చుకున్న ఉలితో ఎడమ భుజంపై పొడిచాడు. సాంబశివరావుకు నరం తెగడంతో చిన అవుటపల్లి పిన్నమనేని సిద్ధార్థ హాస్పిటల్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైభవంగా నమామి సాయి శతరుద్రీయం

హనుమాన్‌జంక్షన్, జూన్ 23 : ప్రపంచ శాంతి, లోకకల్యాణార్థం కోసం భగవాన్ సత్యసాయిబాబా శత జన్మదిన ఉత్సవాల్లో భాగంగా సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో నమామి సాయి శతరుద్రీయం కనుల పండువగా నిర్వహించారు. హనుమాన్‌జంక్షన్‌లో సత్యసాయి సేవా మండలి ఆధ్వర్యంలో ఆదివారం నమామి సాయి శతరుద్రీయంలో భాగంగా సత్యసాయి సేవా సంస్థల వేదాధ్యయన విభాగం సమన్వయకర్త డాక్టర్ కొరారు సాయిశ్రీహరిప్రసాదశర్మ ఆధ్వర్యంలో అత్యంత నియమనిష్ఠలతో శాస్త్రోక్తంగా 84వ మాహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. తెల్లవారుఝామున ఇందిరానగర్‌లోని శ్రీసత్యసాయి నిలయం నుంచి భక్తులతో మేళతాళాలు, మంగళవాయిద్యాల మధ్య నగరసంకీర్తనతో సత్యసాయిబాబా పల్లకీసేవ (శోభాయాత్ర) నిర్వహించారు. గో పూజ, ప్రశాంతి పతాక ఆవిష్కరణ అనంతరం జ్యోతి ప్రజ్వలనతో నమామి సాయి శతరుద్రీయం నిర్వహించారు. స్థానిక సత్యసాయిబాబా సేవ మండలి కన్వీనర్ బెక్కం వెంకటేశ్వరరావు, గరికపాటి రామకృష్ణ, నండూలి ప్రసాద్, తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

భువనేశ్వరీ పీఠంలో యాగాలు



హోమం చేస్తున్న కమలానంద భారతీస్వామి

గన్నవరం, జూన్ 23 : మండలంలోని కేసరపల్లి శివారు భువనేశ్వరీ పీఠంలో పీఠాధిపతి కమలానంద భారతీస్వామి ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సమైక్య గౌరవ అధ్యక్షుడు యామి జాల నరసింహమూర్తి, పలువురు పురోహితులు, వేదపండితులు, అర్చకులు రాష్ట్ర ప్రభుత్వం జనరంజక పాలన అందించాలని విద్యా, వైద్యం ఉపాధి కల్పించాలని కోరుతూ ఆదివారం యాగాలు చేశారు. లక్ష్మీగణపతి, చండీ, రుద్ర, సుదర్శన హోమాలు జరిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆయురారోగ్యాలతో ఉండాలని హోమాలు నిర్వహించారు. ప్రభుత్వ ప్రతినిధులు టీడీ జనార్దన్, అశోక్‌బాబు, బుచ్చి రాంప్రసాద్, పూర్ణహుతిలో పాల్గొన్నారు. పొదిల నారాయణమూర్తి, సత్యవాడ దుర్గాప్రసాద్, రామరాజు, యనమంద్ర సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం



పోరంకిలో నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఎమ్మెల్యే బోడె ప్రసాద్

పెనమలూరు, జూన్ 23 : నిధుల లభ్యతను బట్టి ప్రాధాన్యతా క్రమంలో తాడిగడప మునిసిపాలిటీలోని ప్రజా సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం పోరంకిలో జరిగిన ప్రజాదర్బార్‌లో ఆయన ప్రజల నుంచి వినతులను స్వీకరించి మాట్లాడుతూ, అత్యధికంగా ప్రజల నుంచి అపార్టుమెంట్ ట్యాక్సుల్లో వ్యత్యాసాలు, డ్రెయినేజీలు, మంచినీటి సరఫరా, ధ్వంసమైన రోడ్ల మరమ్మతులు తదితర సమస్యలపై వినతులు వచ్చాయని, అన్ని సమస్యలను క్రోడీకరించి నిధుల లభ్యతను బట్టి ప్రాధాన్యతాక్రమంలో వందశాతం సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సమస్యలపై తాడిగడప మునిసిపాలిటీ వాసులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అందరి సమస్యలు తప్పక పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు అనుమోలు ప్రభాకరరావు తదితరులు ఉన్నారు.



ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌తో తాడిగడప వర్ధినీ రెసిడెన్సీ వాసులు

ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు ఘన సన్మానం

పెనమలూరు, జూన్ 23 : గత ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలిచిన పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌ను ఆదివారం తాడిగడప వర్ధినీ రెసిడెన్సీ, శ్రీరాంనగర్ కాలనీ వాసులు ఘనంగా సన్మానించారు. తాడిగడప వర్ధినీ రెసిడెన్సీ వరకు పెద్దఎత్తున బైక్ ర్యాలీ నిర్వహించి బోడె ప్రసాద్‌కు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో తాడిగడప శ్రీరాంనగర్ కాలనీ వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అభివృద్ధికి ఆశాకిరణం ఎమ్మెల్యే యార్లగడ్డ

పారిశ్రామికవేత్త పుట్టగుంట సతీష్‌కుమార్



ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావును సత్కరిస్తున్న పుట్టగుంట సతీష్‌కుమార్

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 23 : గన్నవరం నియోజకవర్గ అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళికతో కృషి చేస్తున్న ఆశాకిరణం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అని పారిశ్రామికవేత్త పుట్ట గుంట సతీష్‌కుమార్ అన్నారు. విజయవాడలోని యార్లగడ్డ నివాసంలో ఆదివారం సతీష్‌కుమార్ మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్ సహకారంతో గన్నవరం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపిం చడంతో పాటు పారిశ్రామికాభివృద్ధికి కృషి చేయాలని యార్లగడ్డను కోరినట్లు, దానికి తన వంతు సహకారం అందించేందుకు ఎల్లప్పుడూ ముందుంటానని యార్లగడ్డ అన్నట్లు పుట్టగుంట సతీష్‌కుమార్ తెలిపారు. ● ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు నియోజకవర్గంలో శాంతిభద్రతలతో పాటు అభివృద్ధి చేస్తారని తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మూల్పూరి సాయి కళ్యాణి అన్నారు. ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేసిన అనంతరం విజయవాడలోని ఆయన నివాసంలో ఆదివారం కలిసి ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు.

కాకులపాడు చానల్‌లో పూడిక తొలగింపు

సహకారమందించిన చలసాని పూర్ణబ్రహ్మయ్యకు అభినందన



పూడిక, చెత్త తొలగించిన కాకులపాడు చానల్

హనుమాన్‌జంక్షన్‌రూరల్, జూన్ 23 : వేలాది ఎకరాలకు సాగునీరు, 9 గ్రామాలకు తాగునీటిని అందించే కాకులపాడు చానల్ పూడిక తొలగడం తో రైతులు, ప్రజల్లో హర్షం వ్యక్తమౌ తోంది. గత ప్రభుత్వం పూడిక తొలగిం పునకు నిధులు కేటాయించకపోవడం తో పాటు అధికారుల నిర్లక్ష్య ఫలితంగా సాగునీటి కోసం రేయింబవళ్లు ఎదురు చూడాల్సిన పరిస్థితి ఉండేదని రైతులు తెలిపారు. నీటిపారుదలకు అడ్డంకిగా మారిన చెత్త, పెరిగిపోయిన మొక్కలతో నిండిన కాకులపాడు చానల్ కాలువ ఆయుకట్టు రైతుల చొరవతో, చలసాని పూర్ణబ్రహ్మయ్య సహకారంతో పూడిక చెర తొలగింది. చివరి భూములకు కూడా సకాలంలో సాగునీరందుతుందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. పూడిక తీత పనులతో పాటు గట్లపై పెరిగిపోయిన ముళ్లచెట్లను పూర్తిగా తొలగించడం, గట్లను బలోపేతం చేయడం ద్వారా నీటి ప్రవాహానికి అడ్డంకి లేకుండా పోయింది. కాలువ పూడికతీత పనులను కామినేని హరిబాబు, చలసాని శ్రీనివాస్, తిపిర్నేని సత్యనారాయణ తదితర రైతులు పర్యవేక్షించారు.

రోడ్లపై పొంగుతున్న మురుగు



గీతామందిర్ రోడ్డులో మురుగు

ఉయ్యూరు, జూన్ 23 : ఉయ్యూరు నగర పంచాయతీ పరిధిలో పారిశుధ్యం, డ్రెయిన్ల పూడిక అంతంత మాత్రంగా ఉండి ఎక్కడ చూసినా పేరుకుపోయిన చెత్తకుప్పలు, రోడ్లపై ప్రవహిస్తున్న మురుగు కానవస్తుంది. వర్షాలు ప్రారంభమైన తరుణంలో డ్రెయిన్లలో పూడికతీత నిర్వహణ కొరవడడంతో పొంగి రోడ్లపై ప్రవహించడంతో ఆయా ప్రాంతాల్లో నివసించే వారికి అసౌకర్యం కలుగుతుంది. పలుచోట్ల మురుగునీరు పోయే మార్గం లేకుండా డ్రెయిన్లు ఆక్రమణలకు గురికావడంతో తరచూ రోడ్డుపైన మురుగు పొంగి ప్రవహిస్తుంది. ప్రధాన రహదారి వెంబడి, ఇతర ప్రాంతాల్లో డ్రెయిన్లు పొంగుతున్నా నగర పంచాయతీ పారిశుధ్య ఉద్యోగులు, సిబ్బంది పట్టించుకోకపోవడంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ట్రాఫిక్‌తో ప్రజల అవస్థలు


- ఇష్టారాజ్యంగా రోడ్డుపై నిలిపేస్తున్న ఆటోలు, తోపుడు బండ్లు, ద్వి చక్ర వాహనాలు
- పట్టించుకోని పోలీసు శాఖ
- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



ఉయ్యూరు ప్రధాన సెంటర్ సర్కిల్ వద్ద ట్రాఫిక్

ఉయ్యూరు, జూన్ 23 : ఉయ్యూరులో ట్రాఫిక్ సమస్య నానాటికి జటిలమవుతున్న పరిస్థితుల్లో రోడ్డుపైకి రావాలంటే ప్రజలు బెంబేలెత్తిపోన్నారు. ప్రధాన రహదారితో పాటు కాటూరు రోడ్డు, శివాల యంరోడ్డు, పాత స్టేట్‌బ్యాంక్ రోడ్డులో అనునిత్యం ట్రాఫిక సమస్య తలెత్తుతుంది. ప్రధాన సెంటర్ సర్కిల్ వద్ద బస్‌స్టాండ్ రోడ్డు, విజయవాడ రోడ్డు, కాటూరు రోడ్డులో ఆటోలతో పాటు తోపుడు బండ్లు, ద్విచక్రవాహనాలు ఎక్కడపడితే అక్కడ నిలపడం వల్ల ట్రాఫిక్ అంతరాయం కలుగుతుంది. విజయవాడ బస్‌స్టాప్ వద్ద ఆటోలు, ఇతర వాహనాలు పార్కింగ్ చేయడంతో బస్సులు రింగ్ సర్కిల్ వద్ద ఆపి ప్రయాణికులకు ఎక్కించుకుంటున్నారు. దీంతో మార్కెట్ సెంటర్, శివాలయం రోడ్డు నుంచి వచ్చే వాహనాలు నిలి చిపోయి ట్రాఫిక్ సమస్య తలెత్తుతుంది. బస్‌స్టాండ్ వైపు వెళ్లే రోడ్డులో పామర్రు, వీరంకిలాకు వైపు వెళ్లే ఆటోలు, తోపుడుబండ్లపై వ్యాపారం చేసేవారు రోడ్డు మధ్యలో నిలపడంవల్ల బస్‌స్టాండ్ వైపు వెళ్లేవారు ట్రాఫిక్‌లో ఇరుక్కుపోతున్నారు. ఏదో ఓ సమయంలో హోంగార్డును సెంటర్‌లో కేటాయించినా పట్టించుకోపోవడం వల్ల సమస్య ప రిష్కారం కావడం లేదని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా పోలీసులు స్పందించి ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	138, 147, 158
చికెన్ విత్ స్కిన్	268
చికెన్ స్కిన్‌లెస్	278

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ.5.15

ఏపీటీఎఫ్ 80 వసంతాల వేడుక విజయవంతం చేయాలి

మచిలీపట్నం టౌన్, జూన్ 23 : ఏపీటీఎఫ్ 80 వసంతాల వేడుకలను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు కె. శేషగిరి, జిల్లా ప్రధాన కార్యదర్శి బి. లంకేష్ పిలుపునిచ్చారు. వెంకటేశ్వర డిగ్రీ కళాశాలలో జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. జిల్లా అధ్యక్షుడు కె. శేషగిరి అధ్యక్షత వహించి మాట్లాడారు. 117 జీవో రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కార్యదర్శి తమ్ము నాగరాజు మాట్లాడుతూ, విద్యార్థులందరికీ పూర్తి స్థాయిలో పాఠ్యపుస్తకాలు అందించాలని కోరారు. సంఘ మాజీ అధ్యక్షుడు జి. సత్యనారాయణ, జిల్లా గౌరవాధ్యక్షుడు నడకుదిటి రామబ్రహ్మం, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు కె. శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు వి.శివరామకృష్ణ, రేణుకారావు, సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌ను గజమాలతో సత్కరిస్తున్న టీడీపీ నేతలు

మేకావారిపాలెంలో కూటమి విజయోత్సవం

చల్లపల్లి, జూన్ 23 : మేకావారిపాలెంలో తెలుగుయువత నేతలు గుత్తికొండ వంశీకృష్ణ, కాగిత స్వామేలు, మురళి, రాజులపాటి సురేష్, మురాల సురేష్, మోర్ల సాంబశివరావు, బీసీ యువకుల పర్యవేక్షణలో కూటమి విజయోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ కేక్ కట్‌చేశారు. ఆయన గజమాలతో సన్మానించారు. బుద్ధప్రసాద్ కూటమి శ్రేణులందరికీ భోజనాలు పెట్టి సంతోషాన్ని పంచుకున్నారు. యువనేత మండలి వెంకట్రామ్, మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి యార్లగడ్డ శ్రీనివాసరావు, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఎంపీటీసీ సభ్యులు మాలెంపాటి శ్రీనివాసరావు, మేకా బంగారుబాబు, పైడిపాముల స్వప్న, రాజులపాటి అంకమ్మ, టీడీపీ నేతలు గుత్తికొండ కోటేశ్వరరావు, వేమూరి రమేష్‌బాబు, మేకా వెంకటేశ్వరరావు, నిడమానూరి దిలీప్‌కుమార్, మేకా పెద్దబ్బాయ్, లంకతోట మధు, రావెళ్ల ఉదయ్‌కుమార్, జనసేన నేతలు శోభిల లింగాధరరావు, భోగాది భాను, బసవపూర్ణయ్య, బొందలపాటి వీరబాబు, పసుపులేటి రవికుమార్, సూదాని నందగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

మచిలీపట్నం టౌన్, జూన్ 23 : ఉపాధ్యాయుల దీర్ఘకాలిక సమస్యలను పరిష్కరించాలని ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మచిలీపట్నంలోని సంఘ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశానిరి సుబ్రహ్మణ్యం అధ్యక్షత వహించి ప్రసంగించారు. జీవో 117 జీవోను రద్దు చేయాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివరావు మాట్లాడుతూ, నూతన ప్రభుత్వంపై ఉద్యోగులు, ఉపాధ్యాయులు కొండంత ఆశతో ఉన్నారన్నారు. సంఘం రాష్ట్ర పూర్వ ప్రధాన కార్యదర్శి పాండురంగ వరప్రసాద్ మాట్లాడుతూ, ఉపాధ్యాయులకు బకాయిలను నూతన ప్రభుత్వం చెల్లించాలన్నారు. జిల్లా పూర్వ ప్రధాన కార్యదర్శి సీతారామయ్య తదితరులు మాట్లాడారు.



డంపింగ్ యార్డును సందర్శిస్తున్న టీడీపీ కార్పొరేటర్లు నాగరాము, అనిత

డంపింగ్ యార్డు ఇబ్బందులపై మంత్రి రవీంద్రకు నివేదిక

మచిలీపట్నం టౌన్, జూన్ 23 : ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్న డంపింగ్ యార్డు కష్టాలపై మంత్రి కొల్లు రవీంద్రకు నివేదిక అందజేస్తామని టీడీపీ కార్పొరేటర్లు మరకాని సమతాకీర్తి, చిత్తజల్లునాగరాములు అన్నారు. ఆదివారం టీడీపీ కార్పొరేటర్లు కీర్తి, నాగరాము, దింటకుర్తి సుధాకర్, అన్నం ఆనంద్, దేవరపల్లి అనిత, జనసేన కార్పొరేటర్ పినిశెట్టి నాగ ఛాయాదేవి తదితరులు డంపింగ్ యార్డును సందర్శించారు. నాగరాము, సమతాకీర్తి మీడియాతో మాట్లాడారు. డంపింగ్ యార్డు నుంచి వచ్చే దుమ్ము పక్కనే ఉన్న కరెంటు కాలనీ వాసులపై పడుతుందన్నారు. దీని వల్ల కాలనీ వాసులు అనారోగ్య పాలవుతున్నారన్నారు. ఎస్.ఎన్. గొల్లపాలెం, సీతారామపురం గ్రామాలకు వెళ్లే ప్రజలు రోడ్డుపై నడవడం కష్టంగా ఉందన్నారు. సమస్యను మంత్రి కొల్లు రవీంద్ర దృష్టికి తీసుకుని వెళతామని టీడీపీ, జనసేన కార్పొరేటర్లు పేర్కొన్నారు.



టెన్త్ విద్యార్థినికి ఆర్థిక సహాయం అందజేస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

గుడివాడ అభివృద్ధిలో స్వచ్ఛంద భాగస్వామ్యం

గుడివాడ : గుడివాడ అభివృద్ధి స్వచ్ఛంధ సంస్థలు సైతం భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పిలుపునిచ్చారు కన్యకాపరమేశ్వరీ దేవస్థానంలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు దండమూడి జయలక్ష్మీ అధ్యక్షతన జరిగిన 2024-25 సంవత్సరం పాలకవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. రాము మాట్లాడుతూ వారంలో ఒక రోజు ఐ లవ్ గుడివాడ పేరుతో పట్టణాన్ని మనమే శుభ్రం చేసుకుందామని పిలుపునిచ్చారు. అనంతరం 10వ తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన పేద విద్యార్థిని దీక్షిత, బ్రెయిన్ స్ట్రోక్‌కు బలసాని కొండయ్యకు రూ.5000 చొప్పున ఎమ్మెల్యే వెనిగండ్ల చేతుల మీదగా అందజేశారు. మానవతా సంస్థ కేంద్ర నియంత్రణ కమిటీ జిల్లా చైర్మన్ మారుబోయిన కోటేశ్వరరావు, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పొట్లూరి వీరశేషగిరిరావు, దేవస్థానం చైర్మన్ జవ్వాజి గంగరాజు, సంస్థ ప్రథమ అధ్యక్షుడు గుత్తా రమేష్, సంస్థ చైర్మన్ మారుతీ ప్రసాద్ పాల్గొన్నారు.



డాక్టర్ పొట్లూరి గంగాధర్ స్మారక నగదు పురస్కారాలు అందుకున్న విద్యార్థులు

ప్రతిభావంతులకు చేయూతనందిస్తా : డాక్టర్ వంశీ

గుడివాడ : టెన్త్‌లో ప్రతిభ చూపిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల ఉన్నత భవిష్యత్తుకు అండగా ఉంటానని ప్రముఖ వైద్యుడు డాక్టర్ పొట్లూరి వంశీ అన్నారు. ఐఎంఏ హాల్‌లో డాక్టర్ పొట్లూరి గంగాధరరావు జ్ఞాపకార్థం టెన్త్‌లో ప్రతిభ చూపిన ఒక్కొక్క విద్యార్థికి రూ.20వేలు నగదు పురస్కారాలను డీవైఈవో పద్మారాణి చేతుల మీదుగా అందజేశారు. ఐఎంఏ గుడివాడ శాఖ అధ్యక్షుడు డాక్టర్ పాలడుగు వెంకట్రావు, డాక్టర్ పోమూరి వెంకట్రావు, డాక్టర్ వల్లూరుపల్లి సుబ్రహ్మణ్యేశ్వరరావు, డాక్టర్ .లావణ్య, డాక్టర్ మాగంటి శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జేమ్స్‌కు బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నివాళి

గుడివాడ : బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి మానుపాటి జయబాబు(జేమ్స్) మృతి కార్మిక సంఘాలకు తీరని లోటని సీఐటీయూ జిల్లా కార్యదర్శి గోపాలరావు అన్నారు. బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు రాజులపాటి బాబ్రీప్రసాద్ అధ్యక్షతన జేమ్స్ సంతాప సభ నిర్వహించారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీఐటీయూ నాయకులు ఆర్‌సీపీ రెడ్డి, టి.లక్ష్మణరావు, కొండ, వివిధ కార్మిక సంఘాల నాయకులు మండలి సత్యనారాయణ, పోలగాని కృష్ణయ్య, ఓలేటి సీతారాములు, గరికిపాటి నాగమల్లేశ్వరరావు, మురళీ, దుర్గారావు, అప్పలాచారి, జాంపండు, డాల్ఫిన్, వసంతవాడ పెదదుర్గారావు, కృష్ణ, శ్యామ్, లక్ష్మణ తదితరులు పాల్గొన్నారు.



గుర్రపు డెక్కతో నిండిపోయిన ఐనంపూడి డ్రెయిన్



రెగ్యులేటర్ గేట్లు చూపుతున్న శీలం



పెదమద్దాలిలో నారుమడులను సిద్ధం చేస్తున్న కౌలు రైతులు

పూడికతీత చేపట్టక రైతుల ఆందోళన

కూచిపూడి : ఖరీఫ్ సాగుకు ముందే కాలువ పూడికతీత పనులు, గుర్రపు డెక్క తొలగింపు, డ్రెయిన్ల మరమ్మతులు చేయాల్సి ఉండగా, నేటి వరకు చేపట్టకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో 11,250 హెక్టార్లలో రైతులు వరి సాగు చేయాల్సి ఉంది. ప్రధాన డ్రెయిన్లు ఐనంపూడి, గేదెల కోడు, భీమనది డ్రెయిన్ గుర్రపు డెక్కతో పూడుకుపోయాయి. పంట కాలువల పూడికతీత జరగలేదు. ముళ్లకంపలు, పిచ్చికంపతో పంట బోదెలు అస్తవ్యస్తంగా ఉండటంతో సాగు సాగేదెలా? అని రైతులు వాపోతున్నారు. ఖరీఫ్‌కు ముందే పనులు చేయాల్సి ఉండగా, కాలువలకు నీరు విడుదల చేసే సమయం ఆసన్నమైనప్పటికీ నేటి వరకు డ్రెయిన్లు, కాలువలు పూడికతీత పనులు చేపట్టలేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు వీటిపై దృష్టిసారించాల్సిందిగా కోరుతున్నారు.

రెగ్యులేటర్ గేట్లు నిర్మించాలి

మొవ్వ మండలం చినముత్తేవిలో శిథిలమైన రెగ్యులేటర్ గేట్లు పునర్నిర్మించి రైతులను ఆదుకోవాలని కౌలు రైతు సంఘ జిల్లా సహాయ కార్యదర్శి శీలం నారాయణరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక రైతులతో కలసి రెగ్యులేటర్ గేట్లు పరిశీలించారు. రెగ్యులేటర్ ద్వారా 1000 ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. 20 సంవత్సరాల క్రితం నిర్మించిన గేట్లు శిథిలమైపోయాయన్న విషయాన్ని ప్రజాప్రతినిధులకు, అధికారులకు రైతులు అనేక సార్లు తెలిపినా ప్రయోజనం లేకుండాపోయిందన్నారు. తక్షణమే అధికారులు స్పందించి గేట్లు నిర్మాణం చేపట్టాలని నారాయణరావు కోరారు.

చోరంపూడి కాల్వపై డ్రాప్ నిర్మాణం చేపట్టాలి

బంటుమిల్లి : చోరంపూడి కాలవపై శిథిలమైన డ్రాప్ నిర్మాణం చేపట్టాలని కోరుతూ పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్‌కు బంటుమిల్లి రైతు సంఘం నాయకుల వినతి పత్రం అందజేశారు. బంటుమిల్లి ప్రధాన కాలవ నుంచి సర్వస్ కాలవ లక్ష్మీనారాయణపురం వద్ద చోరంపూడి కాలవగా ను, ముల్లపర్రు కాలవగా చీలడంతో చోరంపూడి కాలవపై ముల్లపర్రు దళితవాడ వద్ద డ్రాప్ ఏర్పాటు చేశారు. డ్రాప్ శిథిలావస్థకు చేరడంతో వందలాది ఎకరాల పంటకు నష్టం వాటిల్లుతోందని, అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి డ్రాప్ ఏర్పాటు చేయడం వల్ల వేలాది ఎకరాల సాగులోకి వస్తుందని రైతు సంఘాల నాయకులు తెలిపారు. గౌరిశెట్టి నాగేశ్వరరావు, కైలా రామాంజనేయులు,జి. వెంకటేశ్వరరావు, నారాయణరావు, సుంకర నాగమల్లేశ్వరరావు,అజయ్‌ఘోష్, గౌరిశెట్టి మారయ్య, ఎమ్ జోజిబాబు, బాబురావు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే కాగితకు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘం నాయకులు

ఖరీఫ్ పనుల్లో రైతన్న బిజిబిజీ

పామర్రు : ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో అన్నదాతలు వ్యవసాయ పనులను శ్రీకారం చుట్టారు. తొలకరి పలకరించడంతో ఇప్పటికే వేసవి దుక్కులు దున్ని ఉన్న పంట క్షేత్రాలో వారికి అనుకులమైన వరి విత్తనాలను సేకరించి నారు మడులను రైతులు సిద్ధం చేస్తున్నారు. మరి కొంతమంది రైతులు పంట కాల్వలతోపాటు బోర్ల నీటి ద్వారా నారుమడులను పోసే పనుల్లో బిజీబిజీగా కనిపించారు. మండల వ్యాప్తంగా 9766 హెక్టార్లలోని భూముల్లో అధిక శాతం వరి సాగు పైనే రైతులు దృష్టిసారించారు.



ఘనంగా గణేష్ జన్మదిన వేడుకలు

పామర్రు : తెలుగురైతు ప్రధాన కార్యదర్శి, పామర్రు ఏఎంసీ మాజీ చైర్మన్ వల్లూరిపల్లి గణేష్ జన్మదిన వేడుకలు టీడీపీ అధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వర్లరామయ్య, కూటమి నేతలు గణేష్‌కు జన్మదిన శుభకాంక్షలు తెలియజేశారు. జన్మదిన వేడుకల కేక్‌ను కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు అందజేశారు. తొలుత గణేష్‌ను పార్టీ శ్రేణులు దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

265 మందికి ఉచిత కంటి పరీక్షలు

నాగాయలంక : శంకర కంటి ఆసుపత్రి పెదకాకాని వారిచే మారుతీ విద్యానికేతన్ స్కూల్‌లో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం జరిగింది. సీతారామయ్య ట్రస్ట్ ఆధ్వర్యంలో జరిగిన శిబిరాన్ని ఎమ్మెల్యే తనయుడు మండలి వెంకట్రామ్ ప్రారంభించారు. వైద్యులు యోగిత, చింతన్ 265 మంది రోగులకు పరీక్షలు చేసి అందులో 214 మందిని కంటి ఆపరేషన్ కోసం ఎంపిక చేశారు. తలశిల స్వర్ణలత, తలశిల రఘుశేఖర్, బండ్రెడ్డి హరి, మల్లికార్జున్ తదితరులు పాల్గొనగా, నాగబాబు పర్యవేక్షించారు.

సూర్యనారాయణ స్వామి శాంతి కల్యాణం

అవనిగడ్డ రూరల్ : వేకనూరులో సూర్యనారాయణ స్వామి శాంతి కల్యాణం వైభవంగా జరిగింది. పాకలపాటి రాము బ్రహ్మత్వంలో ఆలయ ధర్మకర్తలు తుంగల వీరవసంతరావు - ఇందిరాదేవి దంపతులచే కల్యాణం వైభవంగా నిర్వమించారు. తుంగల నాగ సంపత్ కుమార్ - లక్ష్మీ శిరీష దంపతుల కుమారుడు చిరంజీవి విరాజ్ పుట్టిన రోజు సందర్భంగా భక్తులకు అన్నదానం నిర్వహించారు.

ఆగని వైసీపీ నాయకుల అరాచకాలు

నందివాడ (పుట్టగుంట) : కూటమి అభ్యర్థుల గెలుపును వైసీపీ నాయకులు జీర్ణించు కోలేకపోతున్నారని పుట్టగుంట గ్రామ టీడీపీ అధ్యక్షుడు మద్దాల ఇస్సాక్ ఆవేదన వ్యక్తం చేశారు. వైసీపీ నాయకులు రాత్రి పూట టీడీపీ బ్యానర్లు చించివేస్తూ వికృత చేష్టలకు పాల్పడుతున్నారన్నారు. జనార్దనపురం, నందివాడ, పుట్టగుంట గ్రామాల్లో వైసీపీ నాయకులు దుశ్చర్యలకు పాల్పడుతున్నారన్నారు. పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసి చర్యలు చేపట్టాలని కోరతానన్నారు.

తల్లి డబ్బులివ్వలేదని ఆత్మహత్య

తోట్లవల్లూరు, జూన్ 23 : తన చెడు అలవాట్లకు తల్లి డబ్బులివ్వలేదన్న మనస్తాపంతో కొడుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దేవరపల్లిలో ఈడే లోకేష్ (21) పెట్రోలు బంకులో పనిచేస్తుండేవాడు. లోకేష్ వ్యసనాలకు బానిసయ్యాడు. లోకేష్ శనివారం తల్లి నాగలక్ష్మిని డబ్బులు అడగటంతో చెడు అలవాట్లు మానుకోవాలని హితవు పలికింది. డబ్బులివ్వలేదన్న మనస్తాపంతో ఆదివారం లోకేష్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఎస్సై పి విశ్వనాథ్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కొండాలమ్మ ఆలయంలో రద్దీ

గుడ్లవల్లేరు : వేమవరం కొండాలమ్మను ఆదివారం 20 వేల మంది భక్తులు దర్శించుకున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కానూరి సురేష్ బాబు తెలిపారు. భక్తులుపాలపొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారని ఆయన తెలిపారు.

అయ్యన్నపాత్రుడుకి స్పీకర్ పదవిపై వెలమ సంక్షేమ సంఘం హర్షం

పామర్రు : చింతకాయల అయ్యన్న పాత్రుడుకి శాసనసభ స్పీకర్‌గా సముచిత స్థానం కల్పించటంపై పామర్రు వెలమ సంక్షేమ సంఘం హర్షం వ్యక్తం చేసింది. భవిష్యత్తులో అయ్యన్న మరెన్నో ఉన్నత పదవులు అధిరోహించాలని వెలమ సంక్షేమ సంఘం నాయకులు గొట్టపు రమేష్ బాబు, పోరిపిరెడ్డి శ్రీహరి, కోరిపల్లి వెంకటేశ్వరరావు, ఎల్. రాము తదితరులు ఆకాంక్షించారు.

నాచుగుంట సమస్యల పరిష్కారానికి కృషి

నాగాయలంక, జూన్ 23 : నాచుగుంట గ్రామ సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. నాచుగుంట గ్రామ ప్రముఖులు సైకం నాగబాబు ఆధ్వర్యంలో గ్రామ పెద్దలు, గ్రామస్థులు అవనిగడ్డలో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, ఆయన తనయుడు మండలి వెంకట్రామ్‌ని కలిసి సత్కరించారు. ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో అద్భుతమైన విజయం అందుకున్న సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. బుద్ధప్రసాద్ వారితో గ్రామ సమస్యలపై చర్చించారు. ఎదురుమొండి - నాచుగుంట రోడ్డు నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. రొయ్యల చెరువుల దిగువన ఉన్న 300 ఎకరాల మాగాణి భూముల రైతులు ఎదుర్కొంటున్న ఉప్పునీటి ముంపు సమస్య పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానని బుద్ధప్రసాద్ హామీ ఇచ్చారు. సైకం దేవదాస్, సైకం నాగరాజు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే బుద్ధప్రసాద్‌ను సత్కరిస్తున్న నాచుగుంట గ్రామస్థులు

నిజాంపేట పాఠశాల పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

మచిలీపట్నం టౌన్, జూన్ 23 : నిజాంపేట గోపాలరావు ప్రాథమికోన్నత పాఠశాలలో 1986-87 సంవత్సరంలో ఏడవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం ఆదివారం ఈశ్వర్ రెసిడెన్సీలో జరిగింది. పూర్వ విద్యార్థులు కుశల ప్రశ్నలు వేసుకుని మధుర స్మృతులను పంచుకున్నారు. పాఠశాల కరస్పాండెంట్ సుబ్బారావు, హెచ్‌ఎం గోరిపర్తి సత్యనారాయణ, పూర్వ విద్యార్థులు ప్రసాద్, సుబ్రహ్మణ్యం, రాధాకృష్ణ, లావణ్య, లాలిత్య, మల్లిక, మాధురి, కృష్ణవేణి తదితరులు మాట్లాడారు. ఉపాధ్యాయులను సత్కరించారు.



ఘనంగా జీఈసీ గ్రాడ్యుయేషన్ డే

గుడ్లవల్లేరు, జూన్ 23 : గుడ్లవల్లేరు ఇంజనీరింగ్ కళాశాల గ్రాడ్యుయేషన్ డే ఆదివారం ఘనంగా జరిఇంది. ఇంజనీరింగ్ డిగ్రీ పూర్తి చేసిన 1155 మంది విద్యార్థులకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బుర్రా కరుణ కుమార్ అధ్యక్షతన కళాశాల సహకార్యదర్శి వల్లూరిపల్లి రామకృష్ణ డిగ్రీ పట్టాలు అందజేశారు. అప్పినీడు తేజశ్రీ (ఇఇఇ), కె.ఎస్.సంజనా కస్తూరి (ఈసీఈ), ఆళ్ల వైష్ణవి (ఐటీ) ప్రతిభను చాటారన్నారు. కళాశాలలో ఈ ఏడాది 58 కంపెనీలు ప్రాంగణ ఎంపికలు నిర్వహించి 872 మందికి ఉద్యోగావకాశాలు కల్పించాయన్నారు. వైస్ ప్రిన్సిపాల్స్ పి.కోదండ రామారావు, ఎమ్మార్సీహెచ్.శాస్త్రి, డైరెక్టర్ డాక్టర్ జి.ఎస్.ఎన్.ఆర్.వి ప్రసాద్ డాక్టర్ ఎం.కామరాజు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ కె.శ్యామ్ సుందర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థినికి గ్రాడ్యుయేషన్ పట్టా అందజేస్తున్న కళాశాల సహకార్యదర్శి వల్లూరుపల్లి రామకృష్ణ

ప్రైవేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలి : ఎస్ఎఫ్ఐ

గుడివాడ : అదనపు తరగతుల పేరుతో విద్యార్థులను మానసికంగా వేధిస్తున్న ప్రైవేట్ విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సమరం డిమాండ్ చేశారు. ఆదివారం ప్రైవేటు పాఠశాలల్లో 9, 10వ తరగతి విద్యార్థులకు ఆదివారం నిర్వహిస్తున్న అదనపు తరగతులను ఆయన పరిశీలించారు. మంత్రి లోకేష్, డీఈవో తాహెరా సుల్తానా ప్రత్యేక దృష్టి సారించి సెల వు రోజుల్లో క్లాసులు నిర్వహిస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ పాఠశా లలపై చర్యలు తీసుకోవాలన్నారు. మండల కార్యదర్శి ఎస్.సమీర్, జిల్లా ఉపాధ్యక్షులు సలీం తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

మచిలీపట్నం టౌన్ : ఛత్రపతి శివాజీ ధైర్యసాహసాలు అలవరచుకోవాలని విశ్రాంత ఉపాధ్యాయుడు వేదాం తం గిరిధర ఆనంద్ అన్నారు. సర్కిల్‌పేటలోని సంతాన వేణుగోపాల స్వామి గుడిలో ఆదివారం ఛత్రపతి శివాజీ మహారాజ్ ఫౌండేషన్ ట్రస్టు ఆధ్వర్యంలో 150 మంది విద్యార్థులకు ఉచితంగా నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ట్రస్టు నిర్వాహకుడు అయోధ్యరామయ్య నిర్వహించిన కార్యక్రమంలో ఘంటసాల తేజ, సౌందర్య, చిన్ననాయుడు, పి. శివానందప్రసాద్, కొల్లిపర యుగంధర్, హేమంత్, భవానీ శంకర్, అన్నం అవినాష్, గంటా సతీష్, నాయుడు దుర్గారావు, ప్రసన్న, చదలవాడ రాజశేఖర్ పాల్గొన్నారు.

తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా కైతేపల్లి దాస్



చల్లపల్లి, జూన్ 23 : తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, చల్లపల్లి నారాయణరావు నగర్ పాఠశాల హెచ్‌ఎం కైతేపల్లి దాస్ ఎన్నికయ్యా రు. టీడీపీ జాతీయ కార్యాలయంలో జరిగిన రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. దాస్ మాట్లాడుతూ, ఉపాధ్యాయులకు, ప్రభుత్వానికి అనుసంధానంగా పనిచేస్తూ ఉపాధ్యా యుల సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తానని తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు మన్నెం శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి రామిశెట్టి వెంకటేశ్వర్లు, కార్యవర్గ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

కూచిపూడిలో 28 నుంచి ఉచిత కంటి వైద్యశిబిరం

కూచిపూడి, జూన్ 23 : శంకర నేత్రాలయం కంటి వైద్యశాల, నటరాజ నాట్యాంజలి సంయుక్త ఆధ్వర్యంలో కూచిపూడిలో ఈనెల 28 నుంచి జూలై 6వ తేదీ వరకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గడ్డమణుగు శివ తెలిపారు. రామ్మూర్తి శత జయంతి సందర్భం గా కూచిపూడిలోని ఎస్ఎస్ఎల్ కన్వెన్షన్ సెంటర్‌లో శిబిరం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కంటి పొర పరిశీలన 28 నుంచి జూలై 4వ తేదీ వరకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట నిర్వహించనున్నట్లు తెలిపారు. జూన్ 2వ తేదీ నుంచి 6వ తేదీ వరకు కూచిపూడిలో కంటి చికిత్స చేయనున్నట్లు తెలిపారు. ఆపరేషన్ చేయించుకున్న వారికి ఐవోఎల్ లెన్స్, కంటి అద్దాలు, మందులు ఉచితంగా ఇవ్వనున్నారు. చికిత్సకు వచ్చే వారు ఫోన్ నెంబర్, ఆధార్ నకలు వెంట తెచ్చుకోవాలని తెలిపారు.

కోడూరులో భారీ అన్నసమారాధన

కోడూరు, జూన్ 23 : కోడూరులో వేంకటేశ్వరస్వామి ఆలయం 28వ వార్షిక బ్రహ్మోత్సవాలు ముగింపు సందర్భంగా ఆదివారం పది వేల మంది భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. ఆలయం వద్ద ఏర్పాట్లను ట్రస్టీ కోట పద్మావతి వరప్రసాద్ పర్యవేక్షించారు.